రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

విశాలాంధ్ర-దత్తిరాజేరు : మండల పరిధిలో గల పెదకాద గ్రామంలో సోమవారం రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు భూమి వివరాలను ఆధార్‌కు అనుసంధానం చేసుకొని 11 అంకెల విశిష్ట సంఖ్యను నమోదు చేసుకుని ఫార్మర్ యూనిక్ ఐడిని పొందాలని దాని వలన రైతులకు పిఎం కిసాన్, క్రాప్ లోన్‌లు, అన్నదాత సుఖీభవ, పంటల కొనుగోలు రాయితీపై, వ్యవసాయ పరికరాలు ఇలా అనేక పథకాలుకి ఈ యూనిక్ ఐడి తప్పనిసరిగా ఉండాలని రైతులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉద్యమించిన మున్సిపల్ కార్మికులు

సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలి

ఈనెల 11న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జై కామేష్ ఎస్ రంగరాజు ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక కంటోన్మెంట్ పెట్రోల్ బంక్ వద్ద నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద తమ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ ఏవో కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఏఒక్క సమస్య పరిష్కారం చేయలేదన్నారు ఎన్ని ప్రభుత్వాలు మారిన మున్సిపల్ కార్మికులకు ఎన్నడూ అన్యాయం జరుగుతూనే ఉందన్నారు.మున్సిపల్ ఉద్యోగ కార్మికుల వేతనాలు చెల్లింపు ,వనుల అప్పగింత నిర్వహణ సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకు పూర్తి బాధ్యతలు ఉండాలని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు కంపెనీ ఏజెన్సీలకు అప్పచెప్పోద్దన్నారు. ఔట్సోర్సింగ్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, మూడు సంవత్సరములుగా పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ మూడు డిఏలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఏడాదికాలంగా పెండింగ్లో ఉన్న మరణించిన రిటైర్మెంట్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు వెంటనే పనులు కల్పించాలని, జీవో నెంబర్ 151 ప్రకారం సూపర్వైజర్లకు జీవో అమలు చేసిన నాటి నుండి వారికి వేతనాలు పెంచుతూ ఏరియర్స్ ఇవ్వాలన్నారు. జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచాలని, ఇంజనీరింగ్, పారిశుద్ధ సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తింపజేసేలా చూడాలన్నారు. రిటైర్ అయిన కాంట్రాక్ట్ కార్మికులకు 75 వేల రూపాయలు గ్రా డ్యూటీ, పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. కార్మికులకు ప్రభుత్వ సెలవు దినములు పండగ సెలవు దినములు వారాంతపు సెలవులు కచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 11న జరిగే చలో విజయవాడ కార్యక్రమాల్లో కార్మికులంతా హాజరు అవ్వాలన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల కాళ్లు కడుగుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఎన్నడూ వారికి అన్యాయం చేస్తూనే ఉందన్నారు. మున్సిపల్ కార్మికులకు ఎన్నడూ సిపిఐ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, పొడుగు రామకృష్ణ ఏఐవైఎఫ్ నాయకులు వెలగాడ రాజేష్ బి వాసు తుపాకుల శీను, దళై శీను, చిరంజీవి తదితర కార్మికులు పాల్గొన్నారు.

జిల్లాలో తాగు నీటి సమస్య లేకుండా చూడాలి

- ఉపాధి హామీ కార్మికులకు కనీస వేతనం పెరగాలి
- ప్రజా సంతృప్తి ధ్యేయంగా పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉంటాయని విపత్తుల శాఖ ప్రకటించిందని, తాగు నీటి సమస్య తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో ఎం.పి.డి.ఓలు, ఈ.ఓ.పి.ఆర్.డి లు, మున్సిపల్ కమీషనర్ల తో తాగు నీరు, ఉపాధి హామీ, ఎం.ఎస్.ఎం.ఈ సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలవారీగా గృహాలకు సరఫరా అవుతున్న తాగు నీటి పైప్ లైన్లను తనిఖీ చేయాలనీ అన్నారు. వచ్చే మూడు నెలలు కీలకమని, ముందే నీటి ప్రణాళికలను తయారుచేసుకోవాలని, ఈ.ఓ.పి.ఆర్.డిలకు తన పరిధిలోనున్న తాగునీటి వనరులపై పూర్తి సమాచారాన్ని కలిగిఉండాలని తెలిపారు. మున్సిపల్ కమీషనర్లు, ఎం.పి.డి.ఓలు, ఈ.ఓ.పి.ఆర్.డిలు ప్రతిరోజు ఈ అంశంపై సమీక్షించుకోవాలని, ఎక్కడైనా చిన్న చిన్న మరమ్మత్తులు అవసరమైన వెంటనే చేపట్టాలని, నిధుల కోసం ఆలోచించ వద్దని అన్నారు. తాగునీటిపై ఎక్కడా ఎలాంటి ప్రతికూల వార్తలు రాకూడదని స్పష్టం చేసారు. ఆర్.డబ్ల్యు.ఎస్ ద్వారా క్రాష్ ప్రోగ్రాం ను చేపట్టి బోరు బావులను, చేతి పంపులను మరమ్మతులు చేపట్టాలని, ఏ రోజు పని ఆ రోజే చేయాలని ఆదేసించారు. పారిశుద్ధ్యం కారణంగా వ్యాధులు సంక్రమించకుండా చూసే బాధ్యత ఈ.ఓ.పి.ఆర్.డి లదేనని తెలిపారు. ఉపాధి హామీ పథకం లో మెటీరియల్ కాంపోనెంట్ కోసం నిధులు వచ్చే అవకాశం ఉందని, వచ్చే మూడు వారాల్లో మొదలు పెట్టిన పనులన్నీ పూర్తి చేయాలనీ అన్నారు. వంద రోజులు పని కల్పన ప్రస్తుతం 30 శాతం ఉందని, కనీసం 70 శాతానికి చేరాలని తెలిపారు. అలాగే కనీస వేతనం కూడా పెరగాలని, అందుకోసం రెండు పూటలా పనిజరిగేలా చూడాలని తెలిపారు. ఎం.ఎస్.ఎం.ఈ సర్వే అక్టోబర్ లో ప్రారంభం అయ్యిందని, మార్చ్ 15లోగా సర్వే పూర్తి కావాలని తెలిపారు. ఇంకనూ 23 వేల వరకు సర్వే చేయవలసి ఉందని, రాజు వారీ లక్ష్యాలను నిర్ణయించుకొని, ప్రతి రోజు సర్వే జరగాలని తెలిపారు. ప్రజలు సంతృప్తి చెందేలా సేవలను అందించాలని, ప్రభుత్వం ఐ.వి.ఆర్.ఎస్ వంటి పద్ధతుల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణను చేస్తోందని, ప్రజలు చెప్పిన అభిప్రాయం ఆధారంగా జిల్లాకు ర్యాంకింగ్ ఇస్తున్నారని తెలిపారు. ప్రతి పని లో జాగ్రత్త వహించాలని, అవినీతి చేసినా ఎదో ఒక రకంగా ప్రభుత్వానికి తెలుస్తుందని, సేవల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నా తెలిసిపోతుందని, ప్రతి క్షణం జాగ్రత్త వహించాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం ప్రధానంగా పారిశుద్యం, వైద్య సేవలు, ఇసుక, మద్యం, పించన్లు అన్న కాంటీన్ల నిర్వహణ తదితర అంశాలపై నిర్వహణా తీరు, అవినీతి, లంచాలు వంటి అంశాలతో ఐ.వి.ఆర్.ఎస్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశం లో డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, పంచాయతి రాజ్ , ఆర్.డబ్ల్యుఎస్ ఎస్.ఈ లు, శ్రీనివాస రావు, కవిత, డి.పి.ఓ వెంకటేశ్వర రావు, జి.ఎస్.డబ్ల్యు కో ఆర్డినేటర్ రోజా రాణి, నలుగురు మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు జరగాలి

నగరపాలక కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం : నగరంలో ప్రణాళికాబద్ధమైన నిర్మాణాలు జరగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రభుత్వం ఈ మధ్య జారీ చేసిన జీఓ వివరాలపై ప్రణాళిక సిబ్బందికి ,లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ కి, కార్యదర్శులకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఉభయ జిల్లాల నుండి వచ్చిన సిబ్బంది, ఎల్టీపీలు పాల్గొని ప్రభుత్వ విధివిధానాలను తెలుసుకున్నారు. భవన నిర్మాణాలు లో సరళతరమైన విధానాలను గూర్చి రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ పి. నాయుడు వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వ విధానాలను సమగ్రంగా విశ్లేషించారు. ఆయనకు టౌన్ ప్లానింగ్ అధికారులు పుష్పగుచ్చానిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎల్టీపీ అసోసియేషన్ సభ్యులు ఆయనకు శాలువ కప్పి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో ప్రకారం సరళతరమైన అనుమతుల మంజూరు, భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ వంటి అంశాలు పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శి ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్మితమవుతున్న భవనాల అనుమతులు పట్ల క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. అనుమతులకు విరుద్ధంగా ఎటువంటి నిర్మాణాలైనా చేపట్టినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ పి. నాయుడు మాట్లాడుతూ చట్టానికి లోబడి భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులు వంటి విషయాలలో సులభతర రీతిలో మంజూరు చేసేందుకు ప్రభుత్వం నూతన విధి, విధానాలను ప్రవేశపెట్టిందన్నారు. ఇకనుండి భవన నిర్మాణాల అనుమతులను స్వీయ ధ్రువీకరణతో పొందే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. లే అవుట్ల అనుమతులకై 40 అడుగుల రోడ్డు నుండి 30 అడుగుల రోడ్డుకు సవరించడం జరిగిందన్నారు. పార్కింగ్ స్థలాలను 750 స్క్వేర్ మీటర్ నుండి 500 స్క్వేర్ మీటర్లకు తగ్గించడం జరిగిందన్నారు. బహుళ అంతస్తుల నిర్మాణ అనుమతుల అధికారాలను వియంఆర్ డిఎ నుండి కమిషనర్ కు బదలాయించడం జరిగిందన్నారు. ఇటువంటి అనేక సరళతరమైన విధానాలతో చట్టబద్ధమైన నిర్మాణాలకు అవకాశాన్ని కల్పిస్తూ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలను అందించడం జరుగుతుంద న్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ డి. శ్రావణి, డిటిసిపిఓ జి. నాగలత, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ ఎం. వాణి తదితరులు పాల్గొన్నారు.

సిఐ ఉపేంద్ర తనయుడు ప్రతిభ

జాతీయస్థాయి ఎడ్యుటెక్‌లో ద్వితీయస్థానం

విశాలాంధ్ర-రాజాం : రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు కుమారుడు జయాన్ జాతీయ స్థాయిలో జరిగిన విశ్వం ఎడ్యుటెక్ పోటీలలో ద్వితీయ స్థానం సంపాదించి రైజింగ్ స్టార్ అవార్డు గెలుచుకున్నాడు. విద్యార్థి స్థానిక డివివి స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్నాడు. ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సోమవారం హైదరాబాదు వేదికగా జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ఈ అవార్డు దక్కించుకున్నాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని స్కూలు ప్రిన్సిపాల్, యాజమాన్యం, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు. శుభాకాంక్షలు తెలిపారు.

జాతర ఏర్పాట్లను సిఐ కె.అశోక్‌కుమార్ పరిశీలన

విశాలాంధ్ర-రాజాం : ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ఈనెల 9,10, 11వ తేదీలలో రాజాంలో జరుగునున్నది కావున ముందస్తు జాగ్రత్తగా రాజాం పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.అశోక్ కుమార్ సోమవారం నాడు ఆలయ ప్రాంగణం మరియు ఎగ్జిబిషన్ గ్రౌండ్ ప్రాంగణం అంతా పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగ కుండా దర్శనం దర్శనం చేసుకునేందుకు క్యూలైన్ విషయమై ఆలయ ఈవో బి.వి. మాధవరావుకు పలు సూచనలు చేశారు.

సిసి రోడ్డుపై మట్టి దిబ్బలు తొలగింపు

మురుగునీరు పోయేందుకు మార్గం సుగమం... కాలనీవాసుల హర్షం

విశాలాంధ్ర-మెరకముడిదాం : కొండ లావేరు పంచాయతీ మధుర గ్రామమైన బాడాం షరాబుల కాలనీలో సిసి రోడ్డుపై మట్టి దిబ్బలు వేయడంతో మురుగునీరు రోడ్డుపై పేరుకుపోయింది. దీనికి స్పందించిన పంచాయతీ సిబ్బంది షరాబల కాలనీలో జెసిబితో మట్టి తొలగించి పారిశుధ్య పనులు చేపట్టడం జరిగింది. మురుగునీరు వెళ్ళేందుకు కూడా తాత్కాలికంగా కాలువలు ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో కాలనీవాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. సిసి రోడ్డుకు ఆనుకొని కాలువ నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాల్సిందిగా కోరుతున్నారు.

జాతీయ సైన్స్ డే సందర్భంగా వివిధ రకాల ప్రదర్శనలు

విశాలాంధ్ర-రామభద్రపురం : జాతీయ సైన్స్ డే సందర్భంగా గ్లోబల్ వ్యూ పాఠశాలలో సోమవారం విద్యార్థిని విద్యార్థులతో వివిధ రకాల ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రాజెక్టులపై తెలియపరిచారు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయులకు యొక్క ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారు. పాఠశాలలో ఘనంగా సైన్స్ డే ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పోల వెంకటరమణ కరస్పాండెంట్ మోహనరావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వినికిడి దినోత్సవం

విశాలాంధ్ర-బాడంగి : బాడంగి జడ్పీ పాఠశాలలో ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్ఎం దత్తి సత్యన్నారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 3న వినికిడి దినోత్సవాన్ని జరుపటానికి ప్రధానకారణం ఉన్నాయన్నారు. వినికిడి సమస్యల గురించి అవగాహన కల్పించడం,వినికిడి సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయడం మరియు వినికిడి శక్తి కోల్పోవడాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవడం ప్రధాన లక్ష్యంగా ఉంటుందని తెలిపారు.ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు డిజే శబ్దాలకు దూరంగా, ఇయర్ ఫోన్లు అతిగా వాడకూడదని, ప్రజలు మేనరిక వివాహలకు దూరంగా ఉంటే వినికిడి లోపం లాంటి వైకల్యాలకు దూరంగా ఉండొచ్చు అని తెలిపారు. 2025 సంవత్సరం సందేశం ఏమనగా "ప్రజలను వినికిడి పరీక్షలు చేయించుకోవటం, వినికిడి సమస్యలను తొలిదశలో గుర్తించి చికిత్స చేయించుకోవడం ద్వారా వినికిడి శక్తిని కాపాడుకోవచ్చని తెలిపారు.దినోత్సవ లక్ష్యం. ఈకార్యక్రమంలో కాకినాడ ప్రత్యేక ఉపాధ్యాయులు ప్రసాద్, పాఠశాల సెక్రటరీ ఈశ్వరరావు, హిందీ ఉపాధ్యాయులు గౌరి నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు సమస్య సత్వరమే పరిష్కారం : ఎంపీడీవో

విశాలాంధ్ర-మెరకముడిదాం : కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో త్రాగునీరు, సమస్యలు సత్వర పరిష్కారం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైంది. కావున తాగునీరు విషయమై ఏమైనా సమస్యలు ఉంటే 8074967684 ఫోన్ కాల్ ద్వారా సంప్రదించి నమోదు చేసుకున్నచో పరిష్కారం కొరకు చర్యలు తీసుకోబడును ఎంపీడీవో భాస్కరరావు తెలిపారు .

పేదలకు హెల్పింగ్ హేండ్స్ వితరణ

విశాలాంధ్ర-జామి : మండలంలోని విజినిగిరి గ్రామంలో ఉన్న హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని పేదవాళ్లకు బట్టలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కీర్తిశేషులు బూర్లే ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు బూర్లే నూకమ నాయుడు దంపతులు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు కొవ్వాడ సన్యాసినాయుడు, కొవ్వాడ చంద్రశేఖర్ ,కుమార్, మిడతాన తాతమ నాయుడు, కిలారి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కిలారి సూర్యారావు, వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, గ్రామ పెద్దలు, పిల్లలు ,మహిళలు పాల్గొన్నారు.

చెరువులో ఆక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర-భోగాపురం : మండలంలోని తూడెం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు చెరువులోని ఆక్రమణలు తొలగించాలని కోరుతూ తహసీల్దార్ ఎం. సురేష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. బసవ పాలెం రెవెన్యూ పరిధిలో కూర్మయ్య చెరువును సగభాగం ఆక్రమించి అందులో మామిడి మొక్కలను వేశారని తెలిపారు. పంచాయతీ అనుమతులు లేకుండా అందులో మట్టి రోడ్డు నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనివల్ల ఉపాధి హామీ కూలీలకు ఈ చెరువులో ఉపాధి పనులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆక్రమణలు తొలగించాలని వీరంతా తాసిల్దార్ ను కోరారు. దీనిపై గ్రామానికి చెందిన గాలి రాజారెడ్డి, దువ్వ అప్పన్న, సమ్మంగి నర్సింగ్ రావు, రీసు అప్పారావు, దువ్వ రాంబాబు, రీసు గణేష్ తదితరులు వినతి పత్రం అందజేశారు.

జిల్లాలో ప్రైవేట్ స్కూలు, కాలేజీల్లో ఫీజులను క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్వో కలిసి విద్యార్థుల సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ప్రజా హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చోడి ఆదినారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ ప్రైవేట్ స్కూల్లో, కాలేజీల్లో ఆర్భాట ప్రచారాలతో అధిక ఫీజులు వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రైవేట్ స్కూల్లో, కాలేజీల్లో చదివే విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధిస్తారని పత్రికల్లో, టీవీల్లో ప్రసారం చేయడం వలన విద్యార్థులు తల్లిదండ్రులు ఆకర్షితులై తమ పిల్లలను ప్రైవేటు స్కూల్లో, కాలేజీల్లో చేర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఫీజుల వలన విద్యార్థుల తల్లిదండ్రులు నిరుపేదలుగా మారుతున్నారని అన్నారు. అధిక ఫీజులు చెల్లించలేక చాలామంది విద్యార్థులు తమ పిల్లల చదువులను మధ్యలో ఆపేసి దినసరి కూలీలుగా, పంపడం జరుగుతుందని ఆవేదన వెలబుచ్చారు. ఏదేశమైనా, ఏ రాష్ట్రంలోనైనా విద్యా, వైద్యం ప్రజలకు అందుబాటులో ఉంటే ఆ దేశం ఆ రాష్ట్రం అభివృద్ధిలో ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేట్ స్కూల్లో కాలేజీలో ఫీజులు నియంత్రణ కోసం ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించి పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కోకన్వీనర్లు దిమిలి పైడిరాజు, కిలం పల్లి ఆచారి పాల్గొన్నారు.

వ్యాక్సిన్ వేయించండి... పశువుల ఆయుష్షును పెంచండి

పశు వైద్యాధికారి డాక్టర్ కే. శ్రీలక్ష్మి

విశాలాంధ్ర-గుర్ల : వైద్య వృత్తిలో నూతన ఒరవడి తీసుకొని రావాలి అని మనిషి ప్రాణం కు పశువు ప్రాణం కు రెండు ఒకటి అని మనిషి తన మాటలు ద్వారా బావాలు వ్యక్త పరుస్తాడు. కాని పశు వులు మూగ జీవులు కనుక వాటి పరిస్థితి బట్టి అర్థం చెసుకొని వాటికి వైద్యం అందించాలి అనేది ఆమె యెక్క ప్రగాఢ నమ్మకం పశు వైద్య వృత్తి నే దైవంగా భావించి ముందు కు సాగుతున్న పశు వైద్యాధికారి డాక్టర్ కె శ్రీలక్ష్మి గుర్ల మండలం లోని కెల్ల గ్రామం లో వాక్సిన్ వేస్తున్న ఆమె మాటలలో... పశువుల లో కాలిగుంటు వ్యాధి సోకిన పశు వులు ఆవు అయినా గేదెలు అయినా. చనిపోవు కాని జీవితాంతం నడవలేని పరిస్థితి ఇంకా నోటికి సోకే తే మేత మేయలేని పరిస్థితి దీనివల్ల పాలు దిగబడి తగ్గిపోతుంది దీనివలన రైతుకు నష్టం వాటిల్లుతోంది ఆదాయం తగ్గిపోతుంది. పరోక్షంగా పాడి పరిశ్రమకు నష్టం వస్తుంది. కనుక ప్రతి పశు వుకు ఆవు అయినా గేదె అయినా వ్యాక్సిన్ వేయించే బాధ్యత రైతు తీసుకోవాలి. ఇంకొకటి బ్రూ సె లె స స్ అనే వ్యాది ముఖ్యంగా లేగ దూడలకి సోకే వ్యాధి. ఈ వ్యాధి పశువుల నుండి మనుషులకు కూడా సంక్రమిస్తుంది అందువలన సకాలంలో వ్యాక్సిన్ వేయించుకోవాలి ఇదే సమయంలో పశు వులకు ట్యాగ్ లు కూడా వేయడం జరుగుతుంది ప్రతి రైతు తమ వంతు బాధ్యతగా తమ వద్ద నున్న పశువులకు వ్యాక్సిన్ వేయించుకొని మాకు సహకరిస్తారని పశువైద్యాధికారి డాక్టర్ కే శ్రీలక్ష్మి కోరారు.

ఏఐటియుసీలో చేరిన జామి కళాసీ సంఘం

విశాలాంధ్ర-జామి : మండల కేంద్రమైన జామిలోని కళాసీ జట్టు సంఘంసభ్యులంతా కలిసి కార్మిక సంఘమైన ఎఐటీయుసిలో చేరారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్‌కమిటీచైర్మన్ సీనియర్ నేత పి. కామేశ్వరరావు ఆధ్వర్యంలో వీరంతా ఎఐటీయుసిలోకి చేరుతున్నట్లుగా ప్రకటించారు. దాదాపు 30మందికిపైగా ఉన్న వీరంతా ఇప్పటి వరకు ఐఎన్‌టియుసి కార్మిక సంఘంలో ఉన్నారు. ఈసందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ మీకు అన్ని విదాలా ఎఐటీయుసి అండగా ఉంటుందని, కష్టసుఖాలలో పాలు పంచుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో కొత్తలి కృష్ణతోపాటు పలువురు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి గ్రస్తులకు సాయం అందించుటకు మేము సైతం

జెడ్పిహెచ్ స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-మెంటాడ : సామాజిక స్పృహతో కుష్టు వ్యాధిగ్రస్తులకు తమ వంతు సహాయంచేసే బాధ్యతను గుర్తు చేసి, ప్రోత్సహించి, అవకాశాన్ని కల్పించిన ఉపాధ్యాయులకు మెంటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. కుష్టి వ్యాధి వలన కలుగు అంగవైకల్యం నివారణకు తల్లిదండ్రుల సహాయంతో ఉపాధ్యాయుల సహకారంతో తమకు కలిగినదాంటిలో సుమారు 15,847/- రూపాయలు లెప్రా సొసైటీ సంస్థ పండింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణ కు సోమవారం ప్రధానోపాధ్యాయులు శ్రీమతి సిహెచ్ అరుణ ద్వారా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు అరుణ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్థి దశలోనే ఇతరులకు సహాయం చేసే గుణమును అవలంభించుకోవడం సంతోషదాయకమని ప్రతి ఒక్కరూ మంచి మనసు కలిగి ఇటువంటి వారికి సహాయం చేయాలని కోరారు అనంతరం విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులపై నివేదిక ఇవ్వండి

అటవీశాఖాధికారులకు ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో కొండ శిఖర చిన్నకోనల తదితర గ్రామాల రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు సహకరించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ఆదేశించారు. రోడ్డు పనులను అటవీశాఖాధికారులు ఆటంకపరుస్తున్నా రంటూ గిరిజనుల నిరసన చేపట్టిన విషయమై వచ్చిన పత్రికా కథనాలపై కమిషన్ చైర్మన్ శంకరరావు స్పందించారు. అనంతగిరి మండలం నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి కొండ శిఖర గ్రామాలైన చిన్నకోనల, భూరిగా, వనిజతో పాటు ఎస్ ఆర్ పురం పంచాయతీ పరిధి మరో ఐదు గ్రామాలకు రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసినప్పటికీ అటవీశాఖ అభ్యంతరం తెలుపుతోందంటూ చిన్నకోనల, వనిజ గ్రామాల వద్ద గిరిజనులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు.ఆయా రోడ్లకు నిధులు మంజూరు, తదనంతరం అటవీశాఖ అభ్యంతరాలపై కమిషన్‌కు నివేదిక సమర్పించాలని చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు సంబంధిత అధికారులకు ఆదేశించారు.గిరిజనుల జీవనానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అలసత్వం వహించరాదన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈఓలు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని నీలకంఠ రాజపురం,జగ్గయ్యపేట, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు ఎస్. నాగభూషణరావు,పి.బాల భాస్కరరావులు సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా పాటశాల పరిసరాలు తరగతి గదులు, టాయిలెట్స్,వంటగది, డ్రింకింగ్ వాటర్ సిస్టమ్,కిచెన్ గార్డెన్ మొదలగునవి పరిశీలించారు. అంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్, చదివించడం, చతుర్విద ప్రక్రియలు చేయించడం, టేబుల్స్ చదివించడం,వర్క్ బుక్స్ పరిశీలించి సంతృప్తం వ్యక్తం చేశారు.

ఖాదర్ బాషాకు నామినేటెడ్ పదవి వరించునా..?

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : విజయనగరంలో ఖాదర్ బాషా ఈ పేరు తెలియని వారు బహుశా ఎవరు ఉండకపోవచ్చు. ఖాదర్ భాషా కంటే టిడిపి భాష అనే పేరుతో పిలువబడతారు. గత కొన్ని సంవత్సరాలుగా విజయనగరం పట్టణ తెలుగు యువత కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలుగుదేశం పార్టీలో ఖాదర్ బాషా ఫైర్ బ్రాండ్ అని చెప్పవచ్చు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పార్టీపై తనదైన శైలిలో విమర్శలు గుప్పిస్తూ సవాళ్లకు ప్రతి సవాళ్లు విసురుతూ తెలుగుదేశం పార్టీ కోసం కష్టించి పనిచేశారు. గత ఎన్నికలలో పార్టీ గెలుపుకై తన వంతు కృషి చేశారు. ఖాదర్ బాషా కేవలం మైనారిటీలలోనే కాదు, అందరివాడిగా తనకంటూ ఒక పేరును సంపాదించుకున్నారు ఖాదర్ భాషా. అయితే నామినేటెడ్ పదవి ఖాదర్ బాషాను వరిస్తుంది అని భాషా వర్గీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారం లేనప్పుడు తనదైన శైలిలో అధికార పార్టీపై విమర్శలు గుప్పిస్తూ ఫైర్ బ్రాండ్‌గా ఖాదర్ భాషా గుర్తింపు తెచ్చుకున్నారు.

పాఠశాల పేరు మార్పు

శ్రీ రుద్రరాజు నారాయణమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీవారి ఆధ్వర్యంలో నడుపబడుతున్న సంస్కృతి ఇంగ్లీషు మీడియం పాఠశాల (అలమండ) R.C.No.-1871/A2/2023) యొక్క పేరును 'అమరావతి ఇంగ్లీషు మీడియం స్కూల్'గా మార్పు చేయడం జరుగుతుంది. (UDISE No. 28127100797). ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు ఉన్న యెడల తెలియచేయగలరు.

ఇట్లు
ఆర్.వి. రామరాజు (కరస్పాండెంట్)
అలమండ గ్రామం, జామి మండలం,
విజయనగరం జిల్లా.
ఫోన్ : 9553883049

గజపతినగరం క్లస్టర్ ఏపీడి రమామణి

విశాలాంధ్ర-రామభద్రపురం : ఉపాధి వేతనదారులందరూ సమయపాలన పాటించాలని గజపతినగరం ఉపాధి హామీ పథకం క్లస్టర్ ఏపీ డి రమామణి వేతనదారులను ఉద్దేశించి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం వేతనదారులతో సమావేశం ఏర్పాటు చేసి వారి యొక్క సమస్యలపై ఆరా తీశారు. రానున్న ఈ వేసవికాలం సందర్భంగా ఎండలు అధికంగా ఉంటాయని అన్నారు. పని ప్రదేశంలో మంచినీరు, టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 60 సంవత్సరాల దాటేవారిని పనికి రావద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో త్రినాథరావు పాల్గొన్నారు.

అత్యంత వైభవపేతంగా అమ్మవారికి కుంకుమ పూజలు

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఆదివారం నుండి మూడు రోజులు పాటు జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ కనకమహలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం ఆలయ మండపం వద్ద అత్యంత వైభవపేతంగా కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు తమ మురుకులు చెల్లించుకున్నారు. ఆదివారం రాత్రి నిర్వహించిన హలో సాంస్కృతిక ఇతర కార్యక్రమాలకు భక్తులు పోటెత్తారు. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి అసర్యము లేకుండా ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డి.ఎస్.పి. ఎస్.రాఘవులు నేతృత్వంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణం వద్ద డాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటిరోజు అమ్మవారి ఆదాయం 5,369696 రూపాయలు. శ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారికి ఐదు లక్షల 36,696 ఆదాయం వచ్చినట్లు ఈవో బి శ్రీనివాసరావు తెలిపారు.

భగవద్గీత మానవ జీవితానికి మార్గదర్శిని

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : భగవద్గీత మానవ జీవితానికి మార్గదర్శిని అని సేవా సంస్థల అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు అన్నారు.సోమవారం పట్టణంలోని కొత్తపేట శ్రీ మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భగవద్గీత వలన ధర్మబద్ధత కోసం అందరికీ తెలుస్తాయని అన్నారు.ఈనెల 6 నుండి 10వ తేదీ వరకు రింగ్ రోడ్ శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిష్కామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు, ఆధ్యాత్మిక ప్రవచనకులు అరుణాజీ భగవద్గీత లోని 3వ అధ్యాయం కర్మ యోగం గురించి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్నట్లు తెలిపారు.సాయంత్రం 5-30 నుండి 6 గంటల వరకు సంకీర్తనలు, అనంతరం ప్రవచనాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.ఈసమావేశంలో సభ్యులు బలివాడ కృష్ణమోహన్, ఎన్.వెంకటరావు, కె.వరహాలు శెట్టి, తదితరులు పాల్గొన్నారు. సభ్యులతో కలిసి ఈమేరకు కరపత్రాలు ఆవిష్కరించారు.

ఆతవ గ్రామ భూముల రీసర్వేకు గ్రామసభ : తహసీల్దారు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని అతవ గ్రామ రెవెన్యూ సంబంధించి భూముల రీసర్వే చేపట్టడం జరుగుతుందని మండల తహసిల్దార్ జె.రాములమ్మ అన్నారు. ఆతవ గ్రామంలో రి-సర్వేకి సంబంధించి సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూముల రీ-సర్వే మరల ప్రారంభించడం జరుగుతుందని అందులో భాగంగా ఆతవ గ్రామాన్ని రీ-సర్వే చేయుటకు ఎంపిక చేయడం జరిగిందన్నారు.అలాగే మండల అధికారులు రీ సర్వే చేసిన సమయంలో రైతులు వారి భూముల దగ్గర ఉండి వారికి గల హక్కు పత్రాలను చూపించాలని సూచించారు. అలాగే ఈ రీసర్వేకి భూములున్న రైతులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొంప వేమన రాము, డిప్యూటీ తహసిల్దారు కే.సన్యాసినాయుడు, వీఆర్వో సచివాలయ సర్వేయర్లు అరవిందు, సాయి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ర్యాలీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రపంచ వినికిడి దినోత్సవ సందర్భంగా జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్.యస్ జీవన రాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శబ్ద కాలుష్యం నివారించాలని అందుకు డీజే వంటి కార్యక్రమాలు నిరోధించాలన్నారు. చిన్న పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వకూడదని, ప్రజలందరూ అవసరం మేరకు మాత్రమే సెల్ ఫోన్ ను వినియోగించాలని పిలుపునిచ్చారు. గోషా ఆసుపత్రిలో గల చిన్నపిల్లల వైద్య నిపుణుల ద్వారా 25 మంది పిల్లల్ని చెవి వినికిడికి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.వి.బిసుబ్రమణ్యం, పి.ఓ. ఎన్సి.డి జిల్లా ఎడిషనల్ డి.ఎం & హెచ్ ఓ డాక్టర్ కె.రాణి , డి.పి.ఎం.ఓ డాక్టర్ ఎన్ సూర్యనారాయణ డి.ఎం.ఓ వై మణి డాక్టర్. వెంకటేష్ డెమో వి. చిన్నతల్లి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా సాగుతున్న ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు చీపురుపల్లిలోని కేటాయించిన రెండు పరీక్ష కేంద్రాలలో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. చీపురుపల్లి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 241 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో 221 మంది విద్యార్థులకు పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. శ్రీనివాస జూనియర్ కళాశాలలో 218 మంది మాత్రమే వీరిలో ఆరుగురు హిందీ ఆరుగురు సాంస్క్రిట్ పరీక్షలను రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వేపాడ : మండల కేంద్రమైన వేపాడలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 194 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 187 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు.కాగా ఏడుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని పరీక్ష నిర్వహణ ఛీఫ్ సూపరిండెంట్ భాస్కరరావు తెలిపారు. మొదటి రోజు నిర్వహించిన ద్వితీయ ఇంటర్ తెలుగు పరీక్షకు ఐ.జగదీష్, కె.రమణమూర్తి, డి.వి.జగదీష్, డి.ప్రసాద్, ఏ. జగన్నాధరావు జి.రమణబాబు, ఎస్.అప్పలనాయుడు, కె.శంకరరావు, బి. ఈశ్వరరావులను ఇన్విజిలేటర్లుగా నియమించడం జరిగిందని తెలిపారు.

కొత్తవలస : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గానూ కొత్తవలస మండలంలో ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లను పగడ్బంధీగా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్తవలస మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, భారత్ జూనియర్ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్ కళాశాల ఈ 4పరీక్ష కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన తెలుగు, సాంస్క్రిట్, హిందీ పరీక్షలకు మొత్తం 630మంది విద్యార్థుల ఎంపికకు గానూ 14మంది విద్యార్థులు గైర్హాజర్ కాగా 616 మంది విద్యార్థులు పరిక్షకు హాజరైనట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 184 మందికి గానూ ముగ్గురు గైర్హాజర్ కాగా, భారత్ జూనియర్ కళాశాలలో 139మందికిగానూ ఇద్దరు, ప్రగతి కళాశాలలో 153మందికి గానూ 7మంది, వాగ్దేవి కళాశాలలో 154మందికి గానూ ఇద్దరు విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు తెలిపారు. ఆయా కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా వసతులను, వైద్య, త్రాగునీటి సదుపాయాలను పరీక్షా కేంద్రాల ఛీఫ్ సూపరింటెండెంట్లు పర్యవేక్షించారు.

రక్తదానంతో ఆదర్శంగా నిలిచిన మంగళపాలెం యువత

విశాలాంధ్ర-కొత్తవలస : రక్తం... అనే మాట ఆత్యవసర సమయాల్లో ఎంతటి ప్రాముఖ్యతో ప్రతీ ఒక్కరికీ తెలిసిందే... అయితే రక్తాన్ని కృత్రిమంగా తయారుచేయలేనిది. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు సైతం తగ్గిన పరిస్థితుల కారణంగా కొన్ని సందర్భాల్లో ఎంత డబ్బు ఖర్చు చేసినా లభించని పరిస్థితి. ప్రమాదాలు, ముఖ్యమైన సందర్భాల్లో ఆపరేషన్లలో ఒక్కోసారి సకాలంలో రక్తం లేక ఎంతోమంది మృత్యువును చేరిన పరిస్థితులు ఉన్నాయి. అటువంటి పరిస్థితులను ఎదుర్కోవాలనే సదుద్దేశ్యంతో నేటి సమాజంలో రక్తానికి ఉన్న ప్రాముఖ్యత, అవసరాన్ని గుర్తించిన ఎన్నో స్వచ్ఛంధ సంస్థలు రక్తదానంపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో అవగాహన కల్పిస్తున్నారు. వారి నుంచి రక్తం సేకరించి, రక్త నిల్వలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. కేవలం ఆపదలో ఉన్న మనిషిని మరో మనిషి మాత్రమే మానవత్వంతో రక్తదానం చేసి ఆదుకునే గొప్ప అవకాశం శ్రుష్టిలో భాగమవ్వడం అదృష్టమనే చెప్పాలి. అయితే రక్తదానంలో కొందరికీ ఎన్నో అపోహలు, అనుమానాలు ఉన్నప్పటికీ... వాటిని తప్పని ఋజువుచేస్తున్నారు మంగళపాలెం గ్రామానికి చెందిన పలువురు యువకులు. తగ్గిన గ్రామంలో దాదాపు 12ఏళ్లుగా వివిధ సందర్భాల్లో 200మందికి పైగా రక్తదానం చేసినవారున్నప్పటికీ... పోలమరశెట్టి భరణి 32సార్లు, ఐతంశెట్టి ఈశ్వర్ 25సార్లు, పోలమరశెట్టి శ్రీకాంత్ 25సార్లు, అన్నిటికంటే ముఖ్యంగా రేర్ బ్లడ్ గ్రూప్ ఏ-నెగెటివ్ అయిన పోలమరశెట్టి శివశంకర్ 15 సార్లు రక్తదానం చేసి ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవులయ్యారు. అందుకే అందరూ వీరిని ఆదర్శంగా చేసుకుని స్వచ్ఛంధంగా రక్తదానం చేయాలని కోరుదాం, రక్తదాతా.. సుఖీభవా అని ప్రార్థిద్దాం.

చిన్న వయసులో వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర-నెల్లిమర్ల : చిన్న వయసులో వివాహలు చేయడం వలన జరిగే అనర్ధాలు గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్ టీ త్రినాధ వివరించారు. నేషనల్ చిల్డ్రన్స్ డే సందర్భంగా నెల్లిమర్ల సెక్టార్ థామస్ పేట అంగన్వాడి సెంటర్లో సోమవారం చైల్డ్ మ్యారేజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహానికి ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండాలని తెలిపారు, ఎవరైనా చిన్నవయసులో మ్యారేజ్ చేసుకుంటే చట్టబద్ధంగా నేరం శిక్ష కూడా ఉంటుందన్నారు. స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే సంతోషంగా ఉంటారని, కావున చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకోవాలన్నారు. తల్లులకు కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాల గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎన్జీవో నారాయణమ్మ ఏఎన్ఎం ఎర్రమ్మ అంగన్వాడీ టీచర్స్ రమా సరస్వతి డ్వాక్రా ఆర్పీలు ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

కెంపో ఇన్‌స్టాంట్ డెలివరీయాప్ అద్భుతం

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఎంతో అభివృద్ధి చెందుతున్న విజయనగరంలో ఇంటి వద్దకే సులువుగా అన్ని వస్తువులు చేరువయ్యేలా సాంకేతికత లభించడం ఎంతో గర్వకారణం అని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి అన్నారు. సోమవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో కెంపో ఇన్‌స్టాంట్ డెలివరీ యాప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా యశస్వి మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రజలకు ఉపయోగపడే విధంగా యాప్ ను డిజైన్ చేసిన సంస్థ సిఈఓ బోను సంతోష్ ను అభినందించారు. ప్రతి ఒక్కరికి నిత్యం అవసరమయ్యే నిత్యావసర వస్తువులు, మందులు, పాలు, పళ్ళు కూడా తక్కువ సమయంలో చేరవేసే సాధనం ఈ యాప్ లో పొందుపరచడం చాలా గొప్ప విషయమన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన తెలుగుదేశం సీనియర్ నాయకులు పిళ్ళా విజయకుమార్, జిల్లా ఆర్యవైశ్య సంఘం యువజన అధ్యక్షులు ఆరిశెట్టి సందీప్ యాప్ ద్వారా లభించే సదుపాయాలు తెలియజేసారు. సంస్థ సి.ఈ.ఓ. సంతోష్ మాట్లాడుతూ నా జన్మస్థలం విజయనగరం ప్రజలకు మేలు జరిగేలా ఉండాలనే ఉద్దేశ్యంతో కెంపో ఇన్ స్టాంట్ డెలివరీ యాప్ రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గొర్లె గిరిష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలను పూర్తి చేయండి : నగరపాలక కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం : వర్క్ ఫ్రం హెూమ్,నాన్ ఎంఎస్ఎంఈ, మిస్సింగ్ సిటిజన్స్,జియో క్యాప్చరింగ్ వంటి సర్వేలను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సర్వేల పట్ల అలసత్వాన్ని ప్రదర్శిస్తున్న కార్యదర్శులను మందలించారు.త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, ఎమినిటీస్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతర రోజుల్లోనే ప్రతిఏటా అపశృతి... కారణమేంటో..?

ఆందోళన చెందుతున్న భక్తులు

విశాలాంధ్ర-చీపురుపల్లి : కోరికలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన చీపురుపల్లి శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలలో గత ఎనిమిదేళ్లుగా ప్రతి ఏడాది ఏదో ఒక అపశృతి జరిగి నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నడంతో ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తున్న భక్తులు సైతం భయాందోళనకు గురవుతున్నారు. జాతర మహోత్సవాలులో జరిగిన సంఘటనలు ఒక్కొక్కటిగా పరిశీలిస్తే ఒక ఏడాది జాతర మహోత్సవాల్లో భాగంగా జాతర ప్రాంగణంలో జరుగుతున్న సాంస్కృతిక ఉత్సవాలను తిలకిస్తున్న సమయంలో తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రాంగణమునకు సమీపంలో గల నేల బావిలో పడి ఒక యువకుడు మృతి చెందాడు. ఇదిలా ఉండగా మరొక ఏడాది జాతర ఏర్పాటు చేసిన వినోద కార్యక్రమాల వద్ద జైంట్ వీల్ నుంచి జారిపడి ఒక మృతిచెందారు. ఇదిలాఉండగా మరుసటి ఏడాది నిర్వహించిన జాతరలో బాణాసంచాలు పేలుస్తుండగా అది జాతరలోని జనాల పైన పడి ప్రమాదం సంభవించడంతో పలువురు గాయాలపాలయ్యారు. తాజాగా మరో ఏడాది జాతర ప్రాంగణానికి సమీపంలో ట్రాక్టర్ నీళ్ల ట్యాంకర్ కింద ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతిచెందారు. గత ఏడాది నిర్వహించిన జాతర ఉత్సవాలలో రెండు రోజులపాటు ఎటువంటి అపశృతి జరగకపోయినప్పటికీ చివరి రోజున భీకరమైన వర్షం వీధులు గాలులు వేయడంతో జాతరలో చేసిన ఏర్పాట్లు మొత్తం నేలమట్టమయ్యాయి. విద్యుత్ స్తంభాలు, పెద్ద పెద్ద ఫ్లెక్సీ బ్రాకెట్లు, వర్షపు దాటికి నేలకి ఒరిగినప్పటికీ ఏ ఒక్కరికి ఎటువంటి ప్రమాదం వాటిల్లకపోవడంతో నిర్వాహకుల సైతం ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా ఈనెల రెండు నుండి మొదలైన అమ్మవారి జాతర ఉత్సవాలలో మొదటి రోజున జాతర విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ లైన్మెన్ కర్ణపు సత్యం అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పాల వ్యాను ఢీకొని మృతిచెందారు. జాతర రోజులలోనే ప్రత్యేకించి ప్రమాదాలు సంభవిస్తుండడంతో భక్తులు సైతం ఆందోళనకు గురవుతున్నారు. ప్రతిఏటా ఏదో ఒక అపస్మృతి జరగడానికి కారణాలేంటి అంటూ పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారికి అన్నిరకాల పూజలు చేస్తున్నప్పటికీ అమ్మవారి ఆగ్రహానికి ఎందుకు గురి కావాల్సి వస్తుందంటూ పలువురు విశ్మయం చెందుతున్నారు. చీపురుపల్లికి సంబంధించి ఏదో కీడు వెంటాడుతున్నట్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గ్రామ దేవత పండగ ఉత్సవాలలో భాగంగా ఊరంతా ఎనిపోతును ప్రదర్శించి పండగను జరిపించాల్సి ఉన్నదని, దీనికి భిన్నంగా ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తుండడం వల్లే ఇటువంటి అపస్మృతులు జరుగుతున్నాయంటూ గ్రామ చరిత్ర తెలిసిన పలువురు పెద్దలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా గ్రామానికి సంబంధించిన కీడును తొలగించి జాతర ఉత్సవాలను నిర్వహించాలని పలువురు సూచిస్తున్నారు. ఒక ఏడాది జరిగితే ప్రమాదం అనుకోవచ్చు గాని, ప్రతి ఏటా జాతర రోజుల్లోనే ఇటువంటి అపస్మృతులు జరగడం మంచిది కాదంటూ పలువురు సూచిస్తున్నారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : అన్ని రంగాల్లో మహిళలు ముందు ఉండాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ అనురాధ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటు నిర్వహించనున్న మహిళా చైతన్య వేడుకుల్లో భాగంగా సోమవారం నాడు తోట పాలెం అంగన్వాడి కేంద్రంలో మహిళలను సమావేశపరిచి మహిళల హక్కుల గురించి వివరించారు. అంగన్వాడి ప్రీస్కూల్ లో ఉన్న ఆడ పిల్లల పేర్లు తో కేంద్రం పరిధిలో మొక్కను నాటారు. అదేవిధంగా ప్రతి ఇంట్లో వారి బిడ్డ పేరు మీద ఒక మొక్క నాటాలని తల్లులను కోరారు. ఈ వేడుకలలో పిల్లల పోషక విలువలు గురించి, మిల్లెట్స్, బాలామృతంతో వంటకాలను తయారు విధానంపై వివరించారు. క్రీడ, అక్షరాస్యత రంగాలలో ముందున్న మహిళలను గౌరవించడం, గర్భస్థలింగ నిర్ధారణ చట్టం గురించి అవగాహన కల్పించడం, యోగ, మొదలగు అంశాలపై ఈ కార్యక్రమాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి, మంగ, తల్లులు పాల్గొన్నారు.

బొబ్బిలి : బాల బాలికలు నైతిక విలువలతో కూడిన విద్యపై బాలికల తల్లి దండ్రులు దృష్టి సారించా లని బాలికలపై వివక్ష చూపరాదని , బాలికలను ఉన్నత చదువులు చదివించాలని, వివాహానికి తొందరవద్దని, ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ జాగాన విజయలక్ష్మి పిలుపునిచ్చారు. మహిళలు శక్తిగా ఎదగాలని అందుకు విద్య ఆయుధమని అన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఈనెల ఒకటి నుండి 8వ తేదీ వరకు జరుగు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు మండల పట్టణ పరిధిలో ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగానే సోమవారం పట్టణ పరిధిలోమల్లమ్మపేట, మండల పరిధిలోని మెట్టవలస, నారసింహునిపేట, దిబ్బగుడివలస, పక్కి, ముత్తాయివలస, కలవరాయి, జగన్నాధపురం గ్రామాలలో అంతర్జాతీయ మహిళా వారోతర్సవాలు సందర్భంగా అంగన్వాడీ సెంటర్స్ వద్ద ప్రతిజ్ఞ, క్రోవోత్తుల ర్యాలీలు, పర్యావరణ పరిరక్షణకు మొక్కల నాటడం తదితర కార్యక్రమంలో చేపట్టారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు , బాలికల తల్లిదండ్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వ్యాధులు విజృంభించకుండా చర్యలు

- క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సీజనల్, ఇతర అంటువ్యాధులు విజృంభించకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, అతిసారం, వడదెబ్బ తదితర వ్యాధుల వ్యాప్తి, అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలో వ్యాధులు విజృంభించకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపైనే ఉందని, వారికి ఇతర శాఖల నుంచి సంపూర్ణ సహకారాన్ని అందించేలా చూస్తామని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంను చైతన్య పరిచి, క్షేత్రస్థాయిలో వివిధ రకాల వ్యాధులను అరికట్టడానికి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై ప్రజలకు అవగాహన కల్గించేలా చూడాలని ఆదేశించారు. ఇకనుంచి ఏఎన్ఎంలను ఇతర విధులనుంచి తప్పించి, వైద్యాధికారుల ఆధీనంలో పనిచేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎంతోమంది వైద్య, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని, వారంతా అప్రమత్తంగా ఉంటే, చాలా వరకు వ్యాధులను అరికట్టవచ్చునని స్పష్టం చేశారు. అలాగే యాప్‌ల్లో అప్లోడ్ చేసేటప్పుడు, ప్రభుత్వానికి నివేదికలను పంపించేటప్పుడు ఒకటిరెండు సార్లు సరిచూసుకొని, ఖచ్చితమైన వివరాలను పంపించాలని సూచించారు. వచ్చే వేసవిలో వడదెబ్బకు గురికాకుండా అవగాహనా కార్యక్రమాలు, ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని చెప్పారు. దీనికోసం మండల స్థాయిలో వైద్యాధికారులు సమావేశాలను నిర్వహించి కార్యాచరణను రూపొందించాలన్నారు. ప్రభుత్వం ప్రతీనెలా చేపడుతున్న ఫీడ్‌బ్యాక్ సర్వేలో మన జిల్లా ర్యాంకు మెరుగుపడాలని, దీనికోసం వైద్యారోగ్య సిబ్బంది నిర్లిప్తతను విడనాడి తమ సేవలను మరింత మెరుగ్గా ప్రజలకు అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జీవనరాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీ-అడిక్షన్ కేంద్రాలకు అవసరమైన సహకారాన్ని అందిస్తాం : జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మద్యం, డ్రగ్స్ మరియు గంజాయికి అలవాటుపడి, బంగారు జీవితాలను చీకటిమయం చేసుకుంటున్న యువతను ఆయా అలవాట్లు నుండి దూరం చేసి, వారిని తిరిగి సన్మార్గంలో నడిపించేందుకు జిల్లా పోలీసుశాఖ కృతనిశ్చయతంతో పనిచేస్తుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మార్చి 3న అన్నారు. విజయనగరం జిల్లా కేంద్రం ప్రభుత్వ సర్వజనుల ఆసుపత్రి కేంద్రంలోని డీ-అడిక్షన్ సెంటరు, ఎన్.జి.ఓ. ఆధ్వర్యంలో బాబామెట్టలో నడుపుతున్న విముక్తి కేంద్రాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - ఇటీవల కాలంలో మద్యం, డ్రగ్స్, గంజాయికి అలవాటు పడిన వ్యక్తులు పట్టుబడుతున్నారని, వారిని డీ-అడిక్షను సెంటరులో జాయిన్ చేస్తే, వారికి స్వస్థత చేకూర్చేందుకు ఎటువంటి చికిత్స అందిస్తారన్న విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నా మన్నారు. డీ-అడిక్షను సెంటరు పూర్తి స్థాయిలో పని చేసేందుకు కావాల్సిన మౌళిక వసతులు, సిబ్బంది కొరత గురించి వైద్యశాఖ అధికారులతో చర్చించామన్నారు. డీ-అడిక్షను సెంటరుకు అవసరమైన సహకారాన్ని, ప్రోత్సాహాన్ని అందించేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. డ్రగ్స్ కు, మద్యంకు తీవ్రంగా అలవాటుపడిన వ్యక్తుల ప్రవర్తన కూడా చాలా తీవ్రంగా ఉంటుందని, వారికి నిర్భంద వైద్యంను అందించేందుకు కావాల్సిన మౌళిక వసతులు డీ-అడిక్షను సెంటరులో ప్రస్తుతం లేవన్నారు. అదే విధంగా వారు చెడు వ్యసనాల నుండి బయటపడేందుకు రిక్రియేషను ఏక్టివిటీస్ నిర్వహించేందుకు అవసరమైన మౌళిక వసతుల కల్పన గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి, పరిష్కార మార్గాలను త్వరలోనే చూపేందుకు కృషి చేస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి అలవాట్లుకు బానిసలుగా మారిన వ్యక్తులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగు నిర్వహించి, వారి వ్యసనం యొక్క తీవ్రతను బట్టి డీ-అడిక్షన్ సెంటరులో చేర్చుకోవడం జరుగుతుందని వైద్యులు జిల్లా ఎస్పీకి తెలిపారు. డ్రగ్స్, మద్యం, గంజాయి వంటి అలవాట్లు నుండి బయటపడేందుకు వ్యసనపరులకు వారి కుటుంబ సభ్యుల సహకారం చాలా అవసరమని వైద్యులు జిల్లా ఎస్పీకి వివరించారు.

ఆసుపత్రి ఔట్ పోస్టును సందర్శించిన జిల్లా ఎస్పీ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పోలీసు ఔట్ పోస్టును జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సందర్శించి, ఔట్ పోస్టు సిబ్బంది పని తీరును పరిశీలించారు. ఔట్ పోస్టులో పని చేసే పోలీసు సిబ్బంది విధిగా యూనిఫాం ధరించాలని, ఆసుపత్రి పరిసరాల్లో ఏ చిన్న శాంతిభద్రతల సమస్య తలెత్తినా వెంటనే స్పందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసు సిబ్బంది పని తీరును అధికారులు తరుచూ పర్యవేక్షించాలని, వారు నిర్వహించాల్సిన విధులు గురించి పూర్తి స్థాయిలో బ్రీఫ్ చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్స్ డా.ఎం.శివ శ్రీధర్, డా.పి.ఎ.రమణి, విముక్తి పిఓ వై.కాళి ప్రసాద్, సైక్రాటిటీస్ డా. హేమంత్ మాధవ్, డా.జి.బిందు, కౌన్సిలర్ విజయ నిర్మల, సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్.శ్రీనివాస్, సూరి నాయుడు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలిపల్లి పైడితల్లి జాతర ఏర్పాట్లపై సమీక్ష

విశాలాంధ్ర-రాజాం : రాజాంలో ఈనెల 9, 10, 11 తేదీలలో జరగబోయే శ్రీశ్రీశ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ఏర్పాట్లకు సోమవారం అన్ని శాఖలవారు అధికారులతో ఆలయ ఈవో. బీవీ మాధవరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణ సీఐ కె.అశోక్ కుమార్ మాట్లాడుతూ జాతర రద్దీ ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, రెండు డ్రోన్లతో భద్రత పర్యవేక్షిస్తామని, బొబ్బిలి జంక్షన్ నుండి వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు రోడ్ డైవర్షన్ చేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె. రామప్పల నాయుడు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులు తాగేందుకు పలు ప్రాంతాల్లో మంచినీరు ఏర్పాటు చేస్తామని, పరిశుద్ధ లోపం లేకుండా తగు చర్యలు తీసుకుంటామని, అలాగే బయో టాయిలెట్లు పలుప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఫైర్ ఎస్సై జనార్ధన్ రావు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో ఫైర్ సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ ఉంటారని తెలిపారు. అమ్మవారి జాతరకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో మాధవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఫైర్ ఆఫీసర్ జనార్ధన్ రావు, ఏఈ.వెంకట్ రామ్ రాజ్, సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్.హరిప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, ఆలయ అనువంశక ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, వాకచర్ల రాజా, వాకచర్ల పైడిరాజు, సలాది తులసీదాసు, గంది గోపి టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.